క్లుప్తంగా

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: గ్రామాల్లో చదువుకోని పిల్లలంటూ ఉండకూడదని, ప్రతి పిల్లాడూ పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో ఎండీ ఖాసిం అన్నారు. ఎంఈవో కుందంపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిలో తరగతుల వారీగా సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకటో తరగతి అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, గ్రామాల్లో చదువుకోని పిల్లలంటూ ఉండకూడదన్నారు. చదువు మానేసిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిని పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు.

గాజులపల్లికి జ్యోతిష్య మార్తాండ బిరుదు


అవార్డు అందుకుంటున్న గౌతం శర్మ

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు గ్రామానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి గాజులపల్లి సత్యనారాయణ మనవడు గాజులపల్లి గౌతం శర్మకు జ్యోతిష్య మార్తాండ బిరుదు మంగళవారం అందుకున్నారు. అఖిల భారత మహా సంఘం బ్రాహ్మణ-2025 సంవత్సరానికి సంబంధించి గురు పురస్కారం నర్సరావుపేటలో నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు సుబ్రహ్మణ్య శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మండల వాసులు గౌతం శర్మకు అభినందనలు తెలిపారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దర్శి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల (బాలురు) పాఠశాల మరియు కళాశాలలో 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు బుధవారం సాయంత్రం 5 గంటల్లోపు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. మీరా సాహెబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 9వ తరగతి పూర్తి చేసి 60 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, ఇంటర్ మొదటి సంవత్సరంలో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొచ్చెర్లకోట బెల్టు షాపుపై దాడి


మద్యం సీసాలతో ఎక్సైజ్ పోలీసులు

దొనకొండ: మద్యం అక్రమ అమ్మకాలు నిరోధించడంలో భాగంగా దర్శి ఎక్సైజ్ సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొచ్చెర్లకోట బెల్టు షాపుపై మంగళవారం దాడి చేశారు. 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన సుబ్బయ్య అనే వ్యక్తి 15 సీసాలు బెల్టు షాపు నిర్వాహణ కోసం తెచ్చాడు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ బీఆర్ సత్యనారాయణ, సిబ్బంది ఎస్.శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

సర్వే ఆధారంగా స్వచ్ఛత ర్యాంక్


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బేస్తవారిపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ-2025 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు జి.రవివర్మ, ఖాజావలి స్థానిక పంచాయతీలో పర్యటించారు. పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి, పొడి చెత్త నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలల్లో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణపై సర్వే చేశారు. వీటి ఆధారంగా పంచాయతీకి ర్యాంక్ ఇవ్వనున్నట్లు కేంద్ర బృందంలోని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మోయలేని భారం

- వయసుకు మించిన బరువులతో విద్యార్థుల అవస్థలు
- స్కూల్ బ్యాగులతో విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు

విద్యార్థుల బడి సంచి బరువులు ఇలా..	
నిబంధనల ప్రకారం (కిలోల్లో)	
తరగతి	బరువు
1-2	1.5
3-5	2.3
6-7	4
8	4.5
9-10	5
వాస్తవాలు ఇలా ఉన్నాయి	
1-5	5-12
6-10	16-20

పుల్లలచెరువు: పాఠశాలకు వెళ్లే విద్యార్థుల బ్యాగులు ఎంతెంత బరువు ఉంటుందో మనం నిత్యం చూస్తుంటాం. రోజు రోజుకూ బడి సంచి వివిధ రకాల పుస్తకాలతో బరువెక్కుతోంది. ఇంటి నుంచి బడి వరకు ఆ సంచి మోయడమే కష్టమనుకుంటే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో రెండు, మూడు అంతస్తుల మెట్లు ఎక్కాల్సి వస్తోంది. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులతో ఐదు కిలోల పైబడి బరువులున్న పుస్తకాలను మోయిస్తున్నారు. రాష్ట్ర సిలబస్‌కు తోడు ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్ ఐఐటీ, జేఈఈ, సివిల్స్, వివిధ రకాల పుస్తకాలు ఆ బ్యాగులో ఉంటున్నాయి. జిల్లాలో లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు.


స్కూల్ బ్యాగులతో చిన్నారులు

నో బ్యాగ్ డే అమలు చేస్తారా?

విద్యార్థుల్లో ఆహ్లాదం నింపేందుకు, అనుభవపూర్వక పాఠాలు నేర్పేందుకు బ్యాగుల్లేని బడి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గతేడాది జూలైలో మార్గదర్శకాలు జారీ చేసింది. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఏడాదికి 10 రోజులు బ్యాగుల్లేని బడి నిర్వహించాలని నిర్ణయించినా అమలు చేయట్లేదు. అలాగే ప్రతి శనివారం నో బ్యాగుడే అమలు చేయాలని గత ఫిబ్రవరిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అది అమలుకు నోచుకోకుండానే 2024-25 విద్యా సంవత్సరం ముగిసింది. ఈ ఏడాదైనా అమలు చేస్తే ఒక్కరోజైనా బడి సంచి మోత తగ్గుతుంది.

నాడీ వ్యవస్థపై ప్రభావం



పిల్లలు వయసుకు మించి బరువులు మోస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రధానంగా పిల్లల నాడీ వ్యవస్థపై ఆ ప్రభావం కనిపిస్తుంది. మెడ, నడుము, భుజాల నొప్పులు వస్తాయి. బ్యాగు ఒక వైపు వేసుకోవడంతో కండరాల నొప్పి, ఛాతిపై ఒత్తిడి పెరుగుతుంది. వెన్నెముక సమస్యతో పాటు ఎదుగుదల లోపం వస్తుంది. విద్యార్థులు ఎదుగుల వయసులో బరువులు మోస్తే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– డాక్టర్ లక్ష్మీనరసింహ, ప్రభుత్వ వైద్యాధికారి, పుల్లలచెరువు

విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే చర్యలు


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

దర్శి: మండలంలో విద్యుత్ అక్రమ వాడకంపై చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హైమావతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. తనిఖీల అనంతరం మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. హైమావతి, శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 12 మంది అధికారులు, 66 మంది సిబ్బంది 33 బృందాలుగా ఏర్పడి విద్యుత్ సర్వీసులు తనిఖీ చేశామన్నారు. మీటర్ ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ.15 వేల రూపాయలు, అనుమతికన్నా ఎక్కువ విద్యుత్ వాడుకుంటున్న 12 మందికి రూ.6600 జరిమానా విధించామన్నారు. విద్యుత్ అక్రమంగా వినియోగిస్తుంటే 94408 12358, 94408 12359 నంబర్లకు పూర్తి సమాచారం అందించాలని సూచించారు. డీఈలు పి.రవికుమార్, వెంకటేశ్వర్లు, రూరల్ ఏఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

నేడు కార్యవర్గ సమావేశం

దర్శి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ దేవతి వర ప్రసాద్, కన్వీనర్ కపురం శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి జి.వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశంలో హాలులో సాయంత్రం ఐదు గంటలకు జరిగే సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో మానవత సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పలు సేవా కార్యక్రమాల గురించి వివరించడం, ప్రధానంగా మరణించిన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, మరణించిన వారికి శాంతి రథం పంపిణీలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ టి.సుమన్, ఎస్సై ఎం.మురళి, మున్సిపల్ కమిషనర్ ఎంఎం మహేశ్వరరావు హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాతలు

దర్శి: మండలంలోని చందలూరు ఎంపీపీ స్కూల్లో 35 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కేళ్లు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎస్‌జీటీ యర్రగుంట్ల భాస్కర్, ఆయన సతీమణి నిర్మల తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మంగళవారం నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేఎస్‌సీ హరిప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు షేక్ చిన్న ఖాసిం, ఎస్ఎంసీ చైర్మన్ రాయల రూతు, గ్రామ పెద్దలు యర్రగుంట్ల నాగేశ్వరరావు, వెంకట్రావు, ఆర్.సుధాకర్, గురవయ్య, రోశిబాబు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం


ప్రారంభమైన ఆధార్ కేంద్రం

కురిచేడు: మండలంలోని ఆవులమంద సచివాలయం ఒక్కచోటే ఆధార్ సెంటర్ ఉన్నందున మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన జిల్లా కలెక్టర్ కురిచేడు సచివాలయం-2కు మరో ఆధార్ సెంటర్‌ను మంజూరు చేశారు. ఆ ఆధార్ కేంద్రం మంగళవారం ప్రారంభమైంది. మండలంలోని అన్ని పంచాయతీల ప్రజలు, కురిచేడు గ్రామ ప్రజలు ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజు కోరారు.

రోడ్లకు ఇరువైపులా చెత్త వేయరాదు


చెత్తపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

దర్శి: రోడ్లకు ఇరువైపులా చెత్త వేయరాదని జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకట నాయుడు సూచించారు. కెల్లంపల్లి గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీగా ఎన్నికై నందున ప్రభుత్వం నుంచి ఫోన్ కాల్స్ వస్తాయి. గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలపై ఆరా తీయనున్నారు. గ్రామ పంచాయతీ చాలా పెద్దదని, గ్రామ ఏడు హాబిటేషన్లో కలిగి ఉన్నందున చెత్తను షెడ్డు వద్దకు తీసుకొచ్చేందుకు చాలా దూరం రావాల్సి ఉన్నందున చెత్త రవాణా చేసేందుకు ఇబ్బందికరంగా ఉందని కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్లు జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వెంకటనాయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న ఏడు గ్రామాలను స్వయంగా సందర్శించినట్లు చెప్పారు. అక్కడ పరిస్థితులను పరిశీలించి చెత్తను రవాణా చేసేందుకు ఇబ్బంది పడకుండా గ్రామంలోనే నాడపు గుంత తవ్వించాలని సూచించారు. వచ్చిన చెత్తను ఆ గుంతలో నిల్వ ఉంచాలని, తద్వారా ఆ చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు తరలించాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా చెత్తను వేయరాదని, అలా చెత్తను వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దిబ్బలు, మురుగు గుంతలు లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో తప్పనిసరిగా వర్మీ ఎరువులు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శి జి.గురునాథం, సర్పంచి జమ్ముల గురవయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ


కేజీబీవీని పరిశీలిస్తున్న జీసీడీఓ హేమలత

కురిచేడు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీఓ కె.హేమలత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి మెనూ వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కేజీబీవీలో 'విజయ పథం' కార్యక్రమం ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో 100 శాతం ఫలితాలు సాధించాలని మార్గ నిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్కిల్ డే సందర్భంగా ఒకేషనల్ ట్రైనీ విద్యార్థినులు తయారు చేయించిన క్రాఫ్ట్ మెటీరియల్‌ను ఆమె పరిశీలించారు. ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

జనం 'షాక్'!


పగుళ్లిచ్చిన సిమెంట్ దిమ్మె


నీటి ట్యాంక్‌పై ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వెనుక విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు జనానికి దడ పుట్టిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాలికల హైస్కూల్ వెనుక కాళికాంబ ఆలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మె కొద్ది రోజులకే పగుళ్లిచ్చింది. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల సిమెంట్ దిమ్మె పగుళ్లిచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే ప్రాంతంలో యాక్సిస్ బ్యాంక్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా ఒక మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదు కానీ అది ఉంచిన ప్రదేశంపై స్థానికులు, కాళికాంబ ఆలయ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ ఒరలతో కూడిన నీటి ట్యాంక్‌పై మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచడం సరికాదని, మరో ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈ నారాయణరెడ్డిని వివరణ కోరగా.. నీళ్ల ట్యాంక్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు మంచిది కాదు. గతంలో పనిచేసిన అధికారులు అలా చేశారు. దానిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. స్తంభం తగలడం వల్ల సిమెంట్ దిమ్మెకు పగుళ్లు వచ్చాయి. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం' అని తెలిపారు.

రైల్వే పనులను పరిశీలించిన డీఆర్ఎం


రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సుదేష్ణ సేన్


అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం

దొనకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ సుదేష్ణ సేన్ మంగళవారం పరిశీలించారు. ముందుగా ఆమెను రైల్వే సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, స్థానిక నాయకులు, ప్రజలు పూలమాలలు, శాలువాలతో సన్మానించి బొకేలు అందజేశారు. అమృత భారత్ అభివృద్ధి పథకం కింద దొనకొండ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న వివిధ రకాల పనులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. రైల్వే ట్రాక్ పనులు, ప్లాట్‌ఫాం పనులు, లిఫ్ట్ బ్రిడ్జి, ప్లాట్‌ఫాంలోని ఇతర సౌకర్యాలను ఆమె స్వయంగా పరిశీలించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అవి శిథిలావస్థకు చేరి వాడకంలో లేవని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని, మళ్లీ కాంట్రాక్టర్లను పిలిచి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. స్టేషన్‌లోని సిగ్నల్స్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌లో ప్రయాణికులకు తాగునీరు లేవని, కరోనా సమయంలో రాత్రి వేళల్లో దొనకొండ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేశారని, ఆ రైళ్లు నేటికీ పునరుద్ధరించలేదని, రాత్రి వేళల్లో స్థానికులు స్వగ్రామానికి వచ్చేందుకు ఇబ్బందిగా ఉంటుందని, మార్కాపురం వెళ్లి మళ్లీ ఆటోల్లో దొనకొండ ప్రాంతానికి రావాల్సి వస్తోందని, చాలా సార్లు ప్రజాప్రతినిధులకు, రైల్వే ఉన్నతాధికారులకు తెలిపామని స్థానికులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంట ఏడీఆర్ఎం రమేష్, డీఈఎన్ శ్రీనివాసరావు, సీఈ గతిశక్తి నోయల్ ఫ్రాన్సిస్, రైల్వే పోలీసులు ఉన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


కురిచేడు: జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్


పుల్లలచెరువు: యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న ఏడీ వెంకట రమణ

కురిచేడు: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడంతో పాటు నేల సారవంతాన్ని కాపాడవచ్చని మండల వ్యవసాయాధికారి బి. సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని పొట్లపాడు, పడమర గంగవరం గ్రామాల్లో సాగు చేసిన జొన్న పంటను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ విధిగా పంట మార్పిడి, మిశ్రమ పంటల సాగు, అంతర్ పంటల సాగు చేస్తే ప్రకృతి వైపరీత్యాలతో ఒక పంట నష్టపోయినప్పుడు ఇంకొక పంట నుంచి ఆదాయం పొందడంతో పాటు భూమిలో సేంద్రియ పదార్థాన్ని పెంచవచ్చని తెలిపారు. నీటి సదుపాయం ఉన్నచోట ఉద్యాన పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కొత్తగా సాగు చేసే ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖ నుంచి సబ్సిడీలు లభిస్తాయని తెలిపారు. పొగాకు సాగు చేసే రైతులు ఈసారి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రామాంజనేయులు, మల్లికార్జున నాయక్ పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని చందవరం, పోలేపల్లి గ్రామ రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్‌పై మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నుంచి రైతులు సాగు చేసిన పంటలకు వారే క్రాప్ ఇన్సూరెన్స్ కట్టుకోవాలని తెలిపారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద కంది విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులు వ్యవసాయ సిబ్బందిని కలిసి తీసుకోవచ్చని ఏఓ తెలిపారు. అనంతరం చందవరంలో రైతులు సాగు చేసిన జొన్న పంటను ఆయన పరిశీలించారు.

పుల్లలచెరువు: రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వ్యవసాయ సంచాలకులు వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని కవలకుంట్ల, పిడికిటివానిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు తగు సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు వచ్చే అకాశం ఉందన్నారు. ప్రభుత్వం అరు పంటలకు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ ప్రకటించిందని, రైతులు ఈ పథకం లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి ఏవో గోపీకృష్ణ, సిబ్బంది కోటేశ్వరనాయక్, ప్రేమ్‌కుమార్, రాంబాబు పాల్గొన్నారు.

నైపుణ్యాలే జీవనోపాధికి పునాది


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

తాళ్లూరు: విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో అన్ని రంగాల్లో నైపుణ్య సాధించాలని హెచ్‌ఎం వైఎస్సార్‌కే ప్రసాద్ అన్నారు. మండలంలోని తూర్పు గంగవరం హైస్కూల్లో వరల్డ్ యూత్ స్కిల్ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలే జీవనోపాధికి పునాది అన్నారు. తూర్పు గంగవరం పాఠశాకు వొకేషనల్ విద్యలో బీఎఫ్ఎస్ఐ, హెల్త్ కేర్ అందించినట్లు తెలిపారు. విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వొకేషనల్ ట్రైనర్స్ వై.అంజిబాబు, సీహెచ్ దావీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితాతో ప్రశాంత ఎన్నికలు


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి

బేస్తవారిపేట: బీఎల్ఓలు ప్రతి కుటుంబాన్ని సందర్శించి ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని గిద్దలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలు, సూజర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి స్పష్టమైన ఓటరు జాబితాలు దోహదపడతాయన్నారు. విచారణ అనంతరం చనిపోయిన, వేరే ప్రాంతంలో శాశ్వతంగా స్థిరపడిన వారి ఓట్లు తొలగించాలని స్పష్టం చేశారు. ఆధార్ కార్డు లేదన్న కారణంతో ఓటు తొలగించవద్దని చెప్పారు. గృహ సందర్శన సమయంలో 18 ఏళ్లు నిండిన యువత ఉంటే ఓటు హక్కు దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ఎ.జితేంద్రకుమార్, ఎలక్షన్ డీటీ షేక్ ఇబ్రహీం ఖలీల్ పాల్గొన్నారు.

పైప్ కల్వర్టు ఏర్పాటు చేయాలి


కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతమిదే..

పొదిలి: పెద్దవాగుపై నందిపాలెం పరిధిలో పైపు కల్వర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నందిపాలెం నుంచి ఒంగోలు-కర్నూలు రాష్ట్రీయ రహదారికి చేరుకునే ఈ లింక్ రోడ్డును ప్రధానంగా వ్యవసాయ పనుల కోసం రైతులు వినియోగిస్తుంటారు. గతంలో ఏర్పాటు చేసిన పైపు కల్వర్టు వర్షాల సమయంలో వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు సమస్యగా మారింది. నూతన పైపు కల్వర్టు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.